రాజధానిలో పేదల గూడుపై కుయుక్తులు

- కాలం చెల్లిన రాజకీయ నాయకుడు చంద్రబాబు
- ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు బాబు, కొడుకులకు లేదు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)


నవులూరులో లబ్ధిదారునికి ప్లాట్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తాడేపల్లిరూరల్: రాజధానిలో పేదల గూడు ఉండకూడదని ఉద్దేశంతోనే చంద్రబాబు నాయుడు కుయుక్తులు చేస్తున్నడని ఆయన మాటలకు ఇక కాలం చెల్లిందని, ప్రజలెవ్వరూ ఆయన్ను నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని నవులూరు, పెనుమాక ప్రాంతాలకు చెందిన నిరుపేదలకు శనివారం పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జీ.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి హాజరయ్యారు. నవులూరులో 350 మంది లబ్ధిదారులకు నవులూరు లే అవుట్‌లోను, పెనుమాకకు చెందిన 261 మందికి కృష్ణాయపాలేనికి చెందిన 26 మందికి కృష్ణాయపాలెం లే అవుట్‌లో ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మొదటి నుంచి పేద ప్రజలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలంటే చులకన అని, వారిని ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని అన్నారు. సీఆర్‌డీఏ చట్ట ప్రకారం 50 వేల మందికి నివేశన స్థలాలు కేటాయించాల్సి ఉందని, కానీ చంద్రబాబు హయాంలో కేటాయించలేదని, అందుకే 2019 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సెంటు స్థలాన్ని ఇస్తుంటే శ్మశానాలతో పోలుస్తూ నీచంగా మాట్లాడిన కాలం చెల్లిన నాయకుడు చంద్రబాబు అని అన్నారు. రానున్న ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబు, మంగళగిరిలో లోకేష్‌లకు గెలిచే సత్తా ఉందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ దొడ్డగ శివపార్వతి, దొడ్డగ కృష్ణ, ఈపూరు యాదవ్, వందనం, పాటిబండ్ల రాంబాబు, పెనుమాకలో పార్టీ కన్వీనర్ దామేష్ రెడ్డి, బషీర్, బొక్క నాని పాల్గొన్నారు. పెనుమాకకు చెందిన వృద్ధురాలైన బాలమ్మ పట్టా పంపిణీ చేస్తున్న సమయంలో నేను, నా కొడుకు జగన్ ఇస్తున్న రూ.2750 పెన్షన్‌తోనే బతుకుతున్నాం. ఇప్పుడు నాకు ఇళ్ల స్థలం కూడా ఇచ్చాడు. అందులో ఎలాగైనా ఇల్లు నిర్మించుకుని కాలం చాలిస్తాను అనడంతో ఎమ్మెల్యే ఆర్కే ఆమె పరిస్థితిని అర్థం చేసుకుని రూ.5 వేల నగదు ఇచ్చి కొత్త బట్టలు కొనుక్కోమని చెప్పడంతో ఆ వృద్ధురాలు ఆనందంతో ఉప్పొంగింది.

నా కొడుక్కి భరోసా లభించింది



నా భర్త శంకరరావు వయస్సు 60 సంవత్సరాలు. మా పెళ్లయిన 30 సంవత్సరాలకి అబ్బాయి పుట్టాడు. మా ఆయనకు రోడ్డు ప్రమాదంలో కాళ్లు పోయాయి. ఆ తరువాత పక్షవాతం వచ్చింది. ఎలా బతకాలో అర్థం కాలేదు. సొంత ఇల్లు లేదు. కొడుకు చిన్నవాడైనా కష్టపడుతుంటే అద్దె ఇంట్లో నివాసముంటున్నాం. జగనన్న ఇచ్చిన ప్లాట్‌తో నా కొడుక్కి ఒక భరోసా లభించింది.

కస్తూరి ప్రగతి

అద్దె బాధలు తప్పాయి



నా పెళ్లయిన దగ్గర నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. సంపాదించిన దాంట్లో కుటుంబ ఖర్చులు, ఇంటి అద్దెలకే సరిపోతున్నాయి. పిల్లల భవిష్యత్‌కు భరోసా లేకుండా పోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఈ స్థలం కేటాయించడంతో మాకు ఎంతో భరోసా లభించింది.

ఎస్‌కే గుల్జార్, నవులూరు

గత ప్రభుత్వంలో స్థలం రాలేదు



గత ప్రభుత్వంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకుని రూ.500 డీడీ తీశాం. ఇదిగో ఇల్లు వస్తుందంటూ స్థానికంగా ఉన్న నాయకులు చెప్పారు. కానీ మాకు ఇల్లు రాలేదు. ఇప్పుడు వలంటీర్లు మా ఇంటికి వచ్చి మీకు ఇంటి పట్టా వచ్చిందని తెలిపారు. మా ప్రాంతంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేరుతోంది.

ఎస్‌కే సైనేజ్

జగనన్న ఇచ్చిన భరోసా ఈ స్థలం



నా భర్త నన్ను పిల్లల్ని వదిలేసి వెళ్లి పదేళ్లు అవుతోంది. అప్పటి నుంచి కూలి పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో నివాసముంటున్నాం. గతంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. ఇప్పుడు వలంటీర్లు ఇంటికి వచ్చి ఇంటి స్థలం వచ్చిందని చెప్పారు. నా పిల్లలకు, నాకు జగనన్న ఇచ్చిన భరోసా ఈ స్థలం. ఇక్కడ ఇల్లు కట్టించుకుని పిల్లల్ని చదివించుకుంటాను.

ఏనుగుకొండ రమణమ్మ, నవులూరు

రాజధానిలో పెత్తందారులపై పేదల విజయం

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎంపీ నందిగం సురేష్
- మందడంలో 356 మంది పట్టాలు పంపిణీ


మందడంలో జగనన్న లే అవుట్ వద్ద లబ్ధిదారుల సందడి

మందడం(తాడికొండ): రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం పెత్తందారులపై పేదల విజయమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. తుళ్లూరు మండలం మందడం లే అవుట్‌లో రాజధానిలో భూమిలేని నిరుపేదలకు పట్టాలు పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎంపీ నందిగం సురేష్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ హాజరయ్యారు. హెనీక్రిస్టినా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకు న్యాయం చేశారని చెప్పారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి నిరుపేదకీ ఇల్లు ఉండాలనే యోచనతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. వారం రోజుల పాటు పేదల పట్టాల పండుగ జరుగనుందని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఈ విజయం పేదలకు సొంతమన్నారు. చంద్రబాబు హయాంలో పేదవాడికి సెంటు భూమి ఎందుకు ఇవ్వలేకపోయాడో ఆత్మ పరిశీలన చేసుకొని మాట్లాడాలన్నారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ పెత్తందారులపై పోరాటం చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షాన హైకోర్టు, సుప్రీంకోర్టులో పోరాడి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నారన్నారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు రావడం అంటే మాములు విషయం కాదని, లబ్ధిదారులంతా సంతోషంగా ఉన్నారని, త్వరలో ఇవి ఊళ్లుగా మారతాయని చెప్పారు. చంద్రబాబును నమ్మి వేలాది మంది రైతులు భూములు ఇస్తే కనీస వసతులు కల్పించకుండా ఈ ప్రాంతంలో సింగపూర్, జపాన్, మలేషియా నిర్మిస్తానని నమ్మించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలతో ముందుకెళ్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేస్తూ సమానత్వానికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్‌ను రూపుదిద్దుతున్నాడటంలో సందేహం లేదన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మాదల మాదల మహేంద్రా, శృంగారపాటి సందీప్, కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, తుమ్మూరు రమణారెడ్డి, నేలపాటి జోగేంద్ర, చలివేంద్రం సురేష్ పాల్గొన్నారు.

యువతలో క్రీడాస్ఫూర్తి..అభినందనీయం


మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

తెనాలి: యువతలో క్రీడా స్ఫూర్తిని నింపే ప్రయత్నం అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. కేబీఎస్ అండ్ కేవైఆర్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంటులో రెండో రోజు శనివారం మ్యాచ్‌లను జంగాల అజయ్‌కుమార్, కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోలా అశోక్ ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. సామాజిక సేవా స్ఫూర్తితో పోటీలు జరపటం ముదావహమన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కృష్ణబలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్ మాట్లాడుతూ టోర్నమెంటు విజేతకు రూ.11 వేలు, రన్నర్‌కు రూ.5 వేల ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. పాల్గొన్న ప్రతి జట్టుకు క్రికెట్ కిట్‌ను అందించనున్నట్టు తెలిపారు. సీపీఐ పార్టీ నాయకులు బొల్లిముంత కృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, కొల్లిపర మండల కార్యదర్శి తుంగ బాలస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి కిరణ్, బిల్లా రాజేష్, యర్రంశెట్టి వేణు, అల్లూరి సాంబయ్య, జెమిని శ్రీను, కావేటి గోపీనాథ్, టోర్నమెంటు నిర్వాహకులు బత్తుల శ్రావణ్, కావేటి శివరాం, రాజశేఖర్, గద్దం రాజ్‌కుమార్, కుప్పల మోహన్ సాయి, అచ్యుత వేణు, కంభం అనిల్, కృష్ణ, ప్రదీప్, గణేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అందుకే ప్రజల్లో 'ఇంగ్లిష్'పై మోజు

- పరిపాలన, న్యాయస్థాన తీర్పులు తెలుగులోనే ఉండాలి
- తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రజా చైతన్య సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

తెనాలి: రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరిగిన విద్యా ప్రైవేటీకరణ/ కార్పొరేటీకరణను ఎవరూ అడ్డుకోలేదని, ఫలితంగానే ప్రజల్లో ఇంగ్లిష్‌పై మోజుకు కారణమైందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యలో 74 లక్షల విద్యార్థులుంటే అందులో 35 లక్షల మంది ప్రైవేటు/ కార్పొరేట్ పాఠశాలల్లోనే చదువుతున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో పరిపాలన తెలుగులో జరగాలనే అంశంపై శనివారం రాత్రి ఇక్కడి పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రజా చైతన్య సభకు కాకతీయ సహకార సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు అధ్యక్షత వహించారు. ప్రభుత్వ జీవోలు, చట్టాలు తెలుగులోనే ఉండాలని ఎమ్మెల్సీ కోరారు. కనీసం జిల్లా న్యాయస్థానాల వరకు ఇచ్చే తీర్పులు తెలుగులోనే ఇవ్వటం సమంజసంగా చెప్పారు. వీటిపై స్పష్టమైన డిమాండ్లతో ముందుకు వెళ్లాలని సూచించారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు తమ రోజువారి వ్యవహారాలు తెలుగులోనే జరుపుకోవాలని, పరిపాలన తెలుగులోనే జరిగేలా కృషిచేయాలని సూచించారు. ప్రజల్లో ఈరకమైన చైతన్యం తీసుకొచ్చేందుకు సమాఖ్య ఆధ్వర్యంలో ఏడాదిపాటు ప్రజా చైతన్య సభలను నిర్వహించనున్నట్టు తెలిపారు. సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ సమావేశకర్త డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు మాట్లాడుతూ.. అన్ని సంఘాలను కలుపుకుని ఉద్యమంలా భాషోద్యమం ముందుకు సాగాలని కోరారు. పట్టణ ప్రముఖులు కొత్తపల్లి రవిబాబు, జంగా వెంకటరెడ్డి, బెల్లంకొండ వెంకట్, యక్కల రామమోహనరావు, బొల్లిముంత కృష్ణ, యక్కల శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. సమాఖ్య కేంద్ర మండలి సభ్యులు డాక్టర్ సామల లక్ష్మణబాబు, యర్రంశెట్టి హనుమంతరావు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఒకటిన ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని వేమవరంలోని సువర్చలాసమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం జూన్ ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. 31న స్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నాగవల్లీదళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు వేద పండితులు నారాయణం గోవర్ధన్ రఘురామ్, పరాంకుశం అజయ్ బాబు నిర్వహిస్తారన్నారు. గురువారం ఉదయం గణపతిపూజ, మండపారాధన, పుణ్యాహవాచనం కార్యక్రమం నిర్వహించి వేదికపై స్వామి శాంతికల్యాణం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయనున్నట్లు వివరించారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బలరామిరెడ్డి కాంప్లెక్సు వద్ద విద్యుత్ వినియోగదారులు బకాయి బిల్లులు చెల్లించేందుకు వీలుగా కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఏఈ పుల్లారెడ్డి శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. వినియోగదారులు తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు.

సీఆర్‌డీఏ పరిధిలో..

తాడికొండ: సీఆర్డీఏ విద్యుత్ సర్కిల్ పరిధిలో అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోని కలెక్షన్ కౌంటర్లు ఆదివారం కూడా పనిచేస్తాయని ఎస్ఈ పత్తిపాటి విజయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమ బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు.

మూలాంకురేశ్వరికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి అమ్మవారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు అయ్యన్నశాస్త్రి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి కుంకుమతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. అనంతరం భక్తుల గోత్ర నామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

తాడేపల్లిరూరల్: ప్రమాదవశాత్తు మృతి చెందిన రెండు కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ తాడేపల్లి అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి శనివారం అందజేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన డోలాస్‌నగర్, వడ్డెర కాలనీకి చెందిన దేరంగుల శివశంకర్, దేరంగుల కృష్ణయ్య కుటుంబాలకు రూ.50 వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, గాలయ్య పాల్గొన్నారు.

ప్రాతూరులో..

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులో చిరువ్యాపారం చేసుకుంటున్న మహిళకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సహాయంతో టిఫిన్ బండిని శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ప్రాతూరు కోటేసు, సంకురు మరియబాబు పాల్గొన్నారు.

ఉండవల్లిలో నేడు మెగా మెడికల్ క్యాంప్



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ఉండవల్లి సెంటర్‌లో ఉచిత మెడికల్ క్యాంప్ ఆదివారం నిర్వహించనున్నట్లు పల్లెటూరి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ జొన్నా రాజేష్ తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కళ్లం వెంకట శివప్రసాద్ రెడ్డి జ్ఞాపకార్థం వంశీ టాలెంట్ స్కూల్‌లో శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో నేత్ర, దంత వైద్య నిపుణులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు, మోకీలు, ఎముకలు, మూత్రపిండాలు, కిడ్నీ సంబంధిత వైద్య నిపుణులు, షుగర్ వైద్య నిపుణులు, జనరల్ ఫిజిషియన్లు వైద్య సేవలను అందిస్తారని చెప్పారు. శిబిరానికి హాజరైన వారికి హెల్త్‌కార్డ్స్ అందించనున్నట్లు పేర్కొన్నారు. వీటిని ఉపయోగించుకుని కన్సల్టేషన్ ఫీజు లేకుండా డాక్టర్‌ని 15 రోజుల లోపు సంప్రదించవచ్చని వివరించారు. త్రిదండి చినజీయర్ స్వామి మంగళశాసనములతో వికాస తరంగిణి నిర్వహించే మహిళా ఆరోగ్య వికాస్ వారు మహిళలకు ఆరోగ్య రక్షణ గురించి అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెబుతారు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: చంద్రబాబు నాయుడిది నీతిమాలిన రాజకీయమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు పేర్కొన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సెంటు భూమి చొప్పున రాజధానిలో కేటాయిస్తే శ్మశానాలతో పోల్చడం ఆయన దిగుజారుడుతనానికి నిదర్శనంగా పేర్కొన్నారు. అన్న ఎన్టీఆర్ మరణానికి కారణమైన చంద్రబాబు అధికారంలో లేనప్పుడు ఆయన ఫొటోలకు దండలు వేస్తూ ఫోజులు ఇస్తున్నాడని ఎద్దేవా చేశారు. మంగళగిరిలో మూడో సారి కూడా ఎమ్మెల్యే ఆర్కేకు ఘన విజయం సాధిస్తారని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, దుగ్గిరాల ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లవరపు సుధారాణి, మంగళగిరి టౌన్ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, మంగళగిరి మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫిరోజ్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీపై శ్రావణ్ కుమార్ వ్యాఖ్యలు దుర్మార్గం

వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: పేదలకు రాజధాని ప్రాంతంలో భూములు పంపిణీ చేస్తుంటే తెనాలి శ్రావణ్ కుమార్ ఎల్లో మీడియాలో దుర్మార్గపు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పేదలకు సెంటు స్థలాలిస్తే అతిపెద్ద మురికివాడ అవుతుందన్న మాటలు హాస్యాస్పదమన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఎన్ని సెంట్లు ఎన్ని వేల మందికి స్థలాలు పంపిణీ చేశారో కూడా వెళ్లి అడిగి తెలుసుకొని ప్రజలకు నిజాలు చెబితే బాగుండేదని పేర్కొన్నారు. ఎస్సీ నియోజకవర్గంలో స్థానికేతరులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని తప్పుడు ప్రచారం చేస్తున్న శ్రావణ్ కుమార్, మంగళగిరి నియోజకవర్గం ఏ సామాజిక వర్గానిదో ఆలోచించుకొని మాట్లాడితే మంచిదన్నారు. సీఆర్డీయే చట్టాని లోబడి హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మాత్రమే ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారనేది తెలుసుకొని మాట్లాడాలన్నారు. శ్రావణ్ కుమార్ మాటలు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేవిగా ఉన్నాయని, బాబా సాహెబ్ అంబేడ్కర్ సూచించిన విధంగా పేదవాడికి ఆర్థిక పరిపుష్టిని కల్పించే దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి యావత్ రాష్ట్రంతో పాటు రాజధాని 29 గ్రామాల్లోని అన్ని వర్గాలు బ్రహ్మరథం పడుతుంటే రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు అడ్డుపడటం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. పేదలకు క్షమాపణ డిమాండ్ చేశారు.

చేనేత ప్రాంగణం పనులు పరిశీలన

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని చేనేత వర్తకుల కోసం మంగళగిరి పాతబస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న ప్రగడ కోటయ్య చేనేత ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, నగర కమిషనర్ శారదాదేవితో కలసి శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించే ఈ కాంప్లెక్స్‌లో పూర్తిగా చేనేత వస్త్రాలు మాత్రమే అమ్మే విధంగా చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని, అతి త్వరలోనే పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆత్మకూరు వాటర్‌పంప్ షెడ్ వద్ద నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ గ్రౌండ్ పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పశు వైద్యురాలు థెరేసాకు అవార్డు


అవార్డు అందుకుంటున్న సంచార పశువైద్యులు డాక్టర్ థెరేసా

తాడేపల్లిరూరల్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా గుంటూరు జిల్లా తాడేపల్లి పశువైద్యులు డాక్టర్ చప్పిడి థెరేసాకు రాష్ట్ర స్థాయి అవార్డును శనివారం ప్రదానం చేశారు. అవార్డు సాధించిన ఆమెను మంగళగిరి పశువర్ధక ఏడీ శ్రీనివాసరావు, తాడేపల్లి పశువైద్యాధికారి పీవీఆర్ నరేంద్రరెడ్డి అభినందించారు. ఈ అవార్డును విజయవాడలోని ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ గన్నవరంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.

ఆట, పాటలతో ఆరోగ్యం

అత్తోట(కొల్లిపర): పిల్లలకు ఆట పాటలతో ఆరోగ్యం, విజ్ఞానం పెరుగుతుందని ఎంపీటీసీ బొల్లిముంత పోతురాజు అన్నారు. శనివారం అత్తోట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐటీసీ ప్రథమ్, ఎం.స్వాతి ఆధ్వర్యంలో రెడీనెస్ మేళా కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు ఆట, పాటలు, విద్య వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పిల్లలను పరీక్షించి, రిపోర్ట్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు జి.శకుంతల, వై.నాగమణి, బి.నాగ సుజాత పాల్గొన్నారు.

హరికథ కళాకారిణి రమణికి సత్కారం

తెనాలి: ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పెమ్మసాని థియేటర్‌లో బొబ్బిలిపులి సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయి మాధవ్ బుర్రా ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు. ప్రముఖ హరికథ, బుర్ర కథ కళాకారిణి యేమినేని రమణిని థియేటరు కమిటీ ఆధ్వర్యంలో వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, సయ్యద్ నిజాముద్దీన్, షేక్ సుబాని సత్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు టిడ్కో లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

తాడేపల్లిరూరల్ : నగరపాలక సంస్థ పరిధిలోని నిడమర్రు, నవులూరు, పెనుమాకలో నిర్మించిన టిడ్కో గృహాలకు సంబంధించి గృహ మంజూరు పత్రాలను ఆదివారం అందజేయనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. నిడమర్రు టిడ్కో లబ్ధిదారులకు ఉదయం 7 గంటలకు, నవులూరులో ఉదయం 9 గంటలకు, పెనుమాక ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

లాం(తాడికొండ): లాం చప్టా సమీపంలో కొండవీటి వాగుపై గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉబ్బిపోయిన స్థితిలో లభ్యమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. 45–50 వయసు ఉండి, గుర్తుతెలియని మహిళ మృతదేహం లాం చప్టా సమీపంలో కాలువలో పడి ఉన్నట్లు సమాచారం రాగా ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. మృతదేహంపై నైటీ ఉందని, 3 రోజుల క్రితం చనిపోయి ఉబ్బిపోయిన స్థితిలో ఉందని వివరాలు తెలిసిన వారు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

రూ.60లక్షలతో సిమెంట్ రోడ్డు

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం బసవతారక నగర్‌లో రూ.60 లక్షలతో సిమెంట్ రోడ్ నిర్మాణ పనులు శనివారం చేపట్టారు. డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ బసవతారక నగర్‌లోని చింత భాస్కరరావు ఇంటి దగ్గర నుంచి ఈద్గా వరకు పనులు చేపట్టామన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేష్ గ్రామానికి చెందిన కౌలురైతు కె.గంగయ్య(36) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలు.. కైలు రైతు గంగయ్య అదే గ్రామానికి చెందిన అంకమ్మరావుకు చెందిన పొలం రెండేళ్లుగా కౌలుకు తీసుకుని మల్లెపూల తోట సాగుచేస్తున్నాడు. దానికోసం సుమారు రూ.5లక్షలు వరకు అప్పుచేశాడు. చేసిన అప్పులు తీర్చలేక ఈనెల 26న పురుగుమందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్సపొందుతూ గంగయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ..

మోటారు సైకిల్‌ను వెనుక నుండి టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన ఎం.కోటేశ్వరరావు (25) బంధువుల ఇంటికి 25న రాత్రి ఫిరంగిపురం మండలం రేపూడి కాలనీకి తన స్నేహితుడి మోటారు సైకిల్‌పై వచ్చాడు. తిరిగి డోకిపర్రు వెళ్తుండగా వేములూరిపాడు గ్రామశివారులోని పాత స్పిన్నింగుమిల్లు వద్ద వెనుక నుండి వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో కోటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి సోదరుడు బ్రహ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

పేద వృద్ధులకు, వికలాంగులకు చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి ఉన్న ఫోర్ కార్నర్స్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు, వికలాంగులకు చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఫోర్ కార్నర్స్ ఇండియా ట్రస్ట్ వ్యవస్థాపకుడు ప్రేమ్‌చంద్ ఎటువంటి ఆధారం లేని వృద్ధులను ఆదుకునేందుకు సంస్థ తరపున ఆర్థిక సహాయం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బేతపూడి సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గాదె వరలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



తాడేపల్లిరూరల్: జాతీయ రహదారిపై చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో శనివారం ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సేకరించిన వివరాలు.. మంగళగిరి నుంచి కొలనుకొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్న సూరి(25) వాహనం అదుపు తప్పడంతో సర్వీస్ రోడ్డువైపు దూసుకెళ్లగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సూరి చేబ్రోలు వాసి అని, పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడని, కొలనుకొండలోని ఓ వివాహ వేడుకకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.